ప్రజాశక్తి
సోమవారం 18 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

ఐఎన్ఐ సిఇటిలో లిఖితకు 335వ ర్యాంకు

ప్రజాశక్తి - పాలకొండ

లిఖితకు స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన (ఐఎన్ఐ - సిఈటి) ఇనిస్ట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్ట్‌లో పట్టణం లోని వేమకోమటి వారి వీధికి చెందిన బంకురు లిఖిత ఆల్ ఇండియా 335 ర్యాంక్ సాధించారు. లిఖిత తండ్రి శ్రీనివాసరావు వ్యాపారి కాగా, తల్లి పద్మావతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, అక్క లావణ్య సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. నీట్‌లో గతంలో 1034 ర్యాంక్ వచ్చింది. ఎండి జనరల్ చేస్తానని లిఖిత తెలిపారు.

సమరోత్సాహం నడుమ సిపిఎం పదో జిల్లా మహాసభ ఆదివారం ముగిసింది. ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని, పాలక పార్టీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను అడ్డుకోవడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని అభిప్రాయపడింది. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రత్యేకించి సాగునీటి ప్రాజెక్టులకు తగినంతగా నిధులు కేటాయించాలని, పారిశ్రామిక రంగ వృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల మెరుగు తక్షణ చర్యలు తీసుకోవాలని, కార్మికులు, రైతులు, కౌలురైతులు, గిరిజనులు, దళితులు సమస్యలపై పోరాడాలని, మహిళలు అణచివేత, గృహ హింస, హత్యలు, అత్యాచారాల నివారణకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, ఉపాధి పనిదినాల పెంపు, పట్టణాలకు వర్తింపు, సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి, పట్టణ పేదలు, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని నిర్ణయించింది. మొత్తంగా 10 అంశాలపై మహాసభలో ప్రతినిధులు ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

సిపిఎం జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు

సమరోత్సాహం

- ముగిసిన సిపిఎం జిల్లా మహాసభ
- 10 అంశాలపై తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం
- జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / టౌన్

నగరంలోని అయ్యన్నపేట సమీపంలో గంట్యాడ రోడ్డులో ఉన్న కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (వెంకట్ సత్య కల్యాణ మండపం)లో కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ ప్రాంగణంలో సిపిఎం విజయనగరం జిల్లా పదో మహాసభ శని, ఆదివారాల్లో జరిగింది. సభకు హాజరైన ప్రతినిధులంతా ప్రాంతాలు, రంగాల వారీగా గడిచిన మూడేళ్లలో చేపట్టిన ఉద్యమాలు, ఫలితాలు, నిర్మాణ అంశాలను చర్చించారు. వీటిపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను సభ స్థూలంగా ఆమోదించింది. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకున్నారు. జిల్లాలోని కీలక సమస్యలు, అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అవరోధాలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాల్లో రాజకీయ విధానం, భవిష్యత్తు పోరాట లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. పాలక పార్టీలు ప్రజల్ని పట్టించుకోకపోవడం వల్ల వారి జీవన స్థితిగతులు మెరుగు పడడం లేదని, వారికి అండగా నిలబడి ప్రభుత్వంపైన పోరాడటమే ప్రథమ కర్తవ్యంగా తీసుకోవాలని సభ అభిప్రాయపడింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద తేడా ఏమీ లేదని, నాడు బిజెపి చెప్పినట్టు వైసిపి వ్యవహరిస్తే, నేడు అదే బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను టిడిపి, జనసేన కూటమి అవలంబిస్తోందని సభ అభిప్రాయపడింది. మహాసభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సౌహార్ద సందేశాన్నిచ్చారు.

జిల్లా కార్యదర్శి
తమ్మినేని సూర్యనారాయణ

నూతన కార్యదర్శిగా తమ్మినేని నాలుగోసారి ఎన్నిక

14 మందితో
జిల్లా కమిటీ ఎన్నిక

సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా రెడ్డి శంకరరావు, టివి రమణ, వి.లక్ష్మి, పి.శంకరరావు తిరిగి ఎన్నికయ్యారు. దీనికి ముందు జిల్లా నూతన కమిటీ సభ్యులుగా 14 మంది ఎన్నికయ్యారు. వీరంతా కలిసి జిల్లా కార్యదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులతోపాటు ఎ.జగన్మోహన్, జి.శ్రీనివాస్, గాడి అప్పారావు, పి.రమణమ్మ, కె.సురేష్, సిహెచ్ వెంకటేష్, విఆర్ గోపాల్, బి.రాంబాబు సహా మరొకరు ఉన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం పర్యవేక్షణలో రెండు రోజుల మహాసభ, ఎన్నిక జరిగాయి.

రెడ్డి శంకరరావు
జిల్లా కార్యదర్శివర్గసభ్యులు

టివి రమణ
జిల్లా కార్యదర్శివర్గసభ్యులు

వి.లక్ష్మి
జిల్లా కార్యదర్శివర్గసభ్యులు

పి.శంకరరావు
జిల్లా కార్యదర్శివర్గసభ్యులు

మాయాబజార్‌లో పత్తి రైతు చిత్తు

- మద్దతు ధర అందని ద్రాక్షే
- వ్యాపారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి
- క్వింటాకు వెయ్యి రూపాయలు నష్టం
- జిన్నింగ్ మిల్లుతో మార్కెటింగ్, సిసిఐ కుమ్మక్కు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మాయాబజార్‌లో రైతులు విలవిలాడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో క్వింటాలుకు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారు. సిసిఐ నిర్దేశించిన మార్గదర్శకాలు సాకుగా చూపి పత్తి రైతులను వ్యాపారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యం దోపిడీ చేస్తున్నారు. మద్దతు ధర అందేలా చూడాల్సిన మార్కెటింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది సీజన్‌లో సుమారు 20వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి అవుతుంది. ఉమ్మడి జిల్లా అంతటికీ ఒకే కొనుగోలు కేంద్రాన్ని రామభద్రపురం మండలం ముచ్చెర్లవలస ప్రతూ జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేశారు. గతంలో సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు అక్కడికి తరలించి అమ్ముకునే పరిస్థితి వుండేది. గత రెండేళ్లుగా సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేస్తున్నారు. అక్కడికి రవాణా చేసి అమ్ముకోవడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 18మండలాల నుంచి పత్తిని ఇక్కడికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు ఎక్కడికక్కడ గ్రామాల్లోనే ప్రయివేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వెయ్యి రూపాయలు తక్కువగా అమ్ముకుంటున్నారు. దీనివల్ల వారికి పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి కనిపిస్తోంది. ఎకరా భూమిలో పత్తి సాగు చేయడానికి రైతులు సుమారు 25వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. ఎకరాకు మూడు లేదా నాలుగు క్వింటాళ్ల పత్తి దిగుబడి అవుతుంది. ఆ పత్తిని విక్రయించినా పెట్టుబడి డబ్బులు రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

సిసిఐ నిబంధనల గుదిబండ

ఏటా పత్తి కొనుగోలు సీజన్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు నిర్దేశించిన నిబంధనలు రైతులకు గుదిబండగా తయారవుతున్నాయి. ఈ నిబంధనలు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యాలకు కాసులు కురిపిస్తున్నాయి. పత్తిలో 12 శాతం లోపు తేమ వుండాలని, ఇసుక, రాళ్లు లేకుండా ఉండాలని, ఎండబెట్టి తీసుకురావాలని సిసిఐ అధికారులు చెబుతున్నారు. ఈ నిబంధనలు సాకుగా చూపి పత్తి రైతుల నుంచి అడ్డగోలుగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లు వరకు పత్తిని తీసుకెళ్ళడం లేదు.

జిన్నింగ్ మిల్లు ఏజెంట్లతో పత్తి కొనుగోలు

రామభద్రపురం మండలం ముచ్చెర్లవలస వద్ద ఉన్న ప్రతూ జిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేయిస్తోంది. క్వింటా పత్తిని రూ.6100 నుంచి రూ.6300వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు పొడవు గింజ పత్తి అయితే రూ.7500, పొట్టి గింజ పత్తి అయితే క్వింటాలుకు రూ.7120 చెపుతున్నారు. అయితే ఈ ధరకు ఎక్కడా పత్తిని కొనుగోలు చేస్తున్న దాఖలాల్లేవు. నాణ్యత పేరుతో రెండు, మూడు వందలు తగ్గించినా కనీసం రూ.6500 నుంచి రూ.6800 ధరకైనా కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ ఆవిధంగా కొనుగోలు చేయడం లేదు.

జిన్నింగ్ మిల్లు తో అధికారుల కుమ్మక్కు

రెండేళ్ల క్రితం వరకు సాలూరు ఎఎంసి యార్డ్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేయడం వెనుక మార్కెటింగ్, వ్యవసాయ, సిసిఐ అధికారుల పాత్ర వుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కై రైతులకు మద్దతు ధర లభించకుండా చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రైతులు పత్తిని విక్రయించాలంటే ముందు సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెబుతున్నారు. పంట ఇ-క్రాప్ చేయించుకోవాల్సి వుంది. ఈ రెండూ అయిన తర్వాత పత్తిని జిన్నింగ్ మిల్లు కి తరలించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అర్బన్ బ్యాంకుకు త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుపై అతి త్వరలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ పగ్గాలు చేపట్టనుంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సిఫార్సుతో ఈ కమిటీని ప్రభుత్వం ఆమోదించనుంది. బ్యాంక్ మాజీ చైర్మన్ కూనిశెట్టి భీమారావు, మాజీ వైస్ చైర్మన్ పప్పల మోహన్ రావు, మాజీ డైరెక్టర్ అక్కేన ప్రసాదరావు పేర్లను త్రిసభ్య కమిటీకి మంత్రి సంధ్యారాణి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. పట్టణంలో మూడు ప్రధాన సామాజిక వర్గాలకు చెందిన టిడిపి నాయకులను త్రిసభ్య కమిటీకి మంత్రి సంధ్యారాణి ఎంపిక చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలోనూ బ్యాంక్‌కు 12 మంది సభ్యులతో పాలక వర్గాన్ని ప్రభుత్వం నామినేట్ చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే తరహాలో త్రిసభ్య కమిటీకి బ్యాంక్ పగ్గాలు అప్పగించనుంది. గత కొంతకాలంగా బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు నిర్వహించడంలేదు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో బ్యాంక్ ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గం పదవీకాలం ముగిసిన తర్వాత ఎన్నికలు నిర్వహించలేదు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాటానికి శంఖారావం పూరిస్తున్నట్టు పలువురు రైతు, కార్మిక, వ్యవసాయ, గిరిజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎపి రైతుకూలీ సంఘ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ నిలిపివేయాలని, లేబర్ కోడ్లను రద్దుచేయాలని, కనీస వేతనాలుఇవ్వాలని, ఉపాధి హామీ పనులకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని, ఉపాధి హామీ పనులు పట్టణాలకు విస్తరించాలని కోరారు. అందరి సామాజిక హక్కులకు, రాజ్యాంగ హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 24న పాలకొండ నుండి వీరఘట్టం, జియమ్మ వలస, మేరంగి, ఖడ్గవలస, పార్వతీపురం మీదుగా సీతానగరం వరకు బైక్ ర్యాలీ చేస్తామని తెలిపారు, 26న పార్వతీపురం పాత బస్టాండ్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ బంటు దాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, రైతు కూలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధ రావు, ఎఐటియుసి నాయకులు టి.జీవ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.గంగునాయుడు, సూరయ్య, అయ్యార్ల సంఘం నాయకులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, ఉత్తరాంధ్ర చెరువుల సంరక్షణ సమితి నాయకులు వంగల దాలినాయుడు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24న బైక్ ర్యాలీ

సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

ఫ్రిజ్ కంప్రెసర్ పేలి పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి - మక్కువ

ఎప్పటిలాగే ఆ కుటుంబం ఇంటి వద్ద పనులు ముగించుకొని పొలం పనుల కోసం ఆదివారం ఉదయం వెళ్లారు. సుమారు 11 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ కంప్రెసర్ పేలిపోయి పెంకుటిల్లు మొత్తం తగలబడిపోయిన సంఘటన మండల కేంద్రం మక్కువ మధ్య వీధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే...

మక్కువకు చెందిన కొవ్వాడ వెంకటరమణ, వరలక్ష్మి ఎప్పటివలే ఇంటిదగ్గర పనులు ముగించుకుని ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లిపోయారు. సుమారు 11 గంటల ప్రాంతంలో వారు నివాసం ఉంటున్న పెంకుటిల్లు కాలిపోయిందని వార్త తెలియడంతో లబోదిబోమంటూ ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లోని సామాగ్రి అంతా కాలిపోవడంతో బోరును విలపించారు. అప్పటికే ఇరుగు పొరుగువారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో సాలూరు ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో వెంకటరమణ బీరువాలో దాచి ఉన్న మూడున్నర లక్షల నగదు, ఆరు తులాల బంగారం, బట్టలు కాలిపోయాయి. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగానే ఫ్రిడ్జ్ కంప్రెసర్ పేలిపోవడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా మొక్కజొన్న పంట అమ్మగా వచ్చిన డబ్బును రెండు రోజుల క్రితమే బీరువాలో దాచామని, ఇంతలో ఈ ప్రమాదం జరిగిపోయిందని రైతు వెంకటరమణ బోరున వెలపిస్తున్నారు. ఇంకా పంట కోసం తెచ్చిన అప్పులు కూడా తీర్చలేదని ఆయన కలత చెందుతున్నాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వెంకటరమణ భార్య వరలక్ష్మి విలపిస్తున్నారు. ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ఒక్కొక్కటిగా దాచుకున్న సామాగ్రి అంతా కాలిబూడిదైందని బోరున విలపిస్తుంది. సంఘటనా స్థలానికి స్థానిక వీఆర్వో, పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వెంకటరమణ కోరుతున్నారు.

సుమారు 15 లక్షలు ఆస్తి నష్టం



పేలుడుకు దగ్ధమైన ఇల్లు

విఆర్‌ఎలపై అక్రమ నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న సిసిఎల్ఎకు సామూహిక రాయబారం కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు విఆర్‌ఎలపై నిర్బంధాన్ని ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు రద్దు చేయాలని, తెలంగాణలో అమలవుతున్న విధంగా పేస్కేల్ జీతాలు చెల్లించాలని, వీఆర్వో, అటెండర్, వాచ్ మెన్, రికార్డ్ అసిస్టెంట్, డ్రైవర్ తదితర ఖాళీ పోస్టులను అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలని, నామినీల్లో విఆర్‌ఎలుగా గుర్తించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న శాంతియుత పద్ధతుల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిసిఎల్ఎకు సామూహిక రాయబారం కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం నుండి కుయుక్తులు ప్రారంభించిందని చెప్పారు. జిల్లాలో స్థానిక తహశీల్దార్లు, పోలీసులు విఆర్ఎ సంఘం నాయకులకు ఫోన్ చేసి సిసిఎల్ఎ కార్యక్రమానికి వెళ్లొద్దని, అరెస్టులు చేసి కేసులు పెడతామని బెదిరింపులు చేస్తున్నారని చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లపై విఆర్ఎ సంఘంతో చర్చలు జరిపి పరిష్కరించాలని కోరుతుంటే ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగానైనా తమ గోడు ప్రభుత్వానికి విన్నవించుకుందామని, శాంతియుత పద్ధతుల్లో నిర్వహిస్తున్న సిసిఎల్ఎ కార్యక్రమాన్ని పోలీసు ఉక్కు పాదంతో అడ్డుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అక్రమ అరెస్టులు సాగించి నిర్బంధాన్ని కొనసాగిస్తే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు .

విజయవంతంగా ర్యాంకింగ్ చెస్ పోటీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం శ్రీ చెస్ కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిర్వహించిన ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఘనంగా జరిగాయి. ఆరు విభాగాలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో 24 మంది బహుమతులను గెలుచుకున్నారు. వీరందర్నీ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నామని నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ప్రారంభించగా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. ఎంఇఒ కె.ప్రసాదరావు పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతోపాటు క్రమశిక్షణ, విలువలను నేర్చుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకొని చదువులో రాణించాలని, సమాజం గర్వించే భావి పౌరులుగా ఎదగాలని ఆశీర్వదించారు. నారంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు సమయపాలన పాటించాలని, జీవితంలో ఎదగాలంటే చదువుతో పాటు ఆటలను కూడా నేర్చుకొని మనోవికాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెంచుకోవాలని సూచించారు. చదరంగం వంటి ఆటలు ఆడడం వల్ల తెలివి తేటలు పెరుగుతాయని, ఏకాగ్రత పెంపొందుతుందని తద్వారా చదువులో మంచి ఫలితాలు సాధించవచ్చని హితవు పలికారు. కార్యక్రమంలో సంస్కృత పండితులు, వ్యాఖ్యాత కవిరత్న జెబి తిరుమలాచార్యులు స్వాగతోపన్యాసంతో ప్రారంభమైంది. పోటీల్లో 11 పాఠశాలల నుండి 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోర్జ హేమసుందరరావునాయుడు, సాలూరు సాహితీ మిత్రబృందం అధ్యక్షులు చావలి శేషాద్రి సోమయాజులు, కార్యదర్శి ఆకుల గణపతి, పూర్వ కార్యదర్శి గొట్టాపు శ్రీనివాసరావు, ఛీఫ్ ఆర్బిటర్ వి.వెంకటేష్, ఆర్బిటర్ మంచిపల్లి గోపీనాథ్, భార్గవి, విజయనగరం నుండి విచ్చేసిన ప్రత్యేక ఆర్బిటర్ బైరెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. విజేతలుగా అండర్-8 బాలికల విభాగంలో వి చైత్రేశ్వరి (ప్రథమ), శరణ్య (ద్వితీయ), అండర్ -10 బాలుర విభాగంలో ఇ.యశ్వంత్ కుమార్ (ప్రథమ), పి.హర్ష (ద్వితీయ), బాలికల విభాగంలో వి.చిరుమానస (ప్రథమ), కె.లిఖిత (ద్వితీయ), అండర్ -12 బాలికలు విభాగంలో కె.తేజస్విని (ప్రథమ), టి.నంద నిరుపమా (ద్వితీయ), బాలురు విభాగంలో వి.ధనుంజయ రాజు (ప్రథమ), విద్యాసాగర్ (ద్వితీయ), అండర్ -14 బాలికల విభాగంలో నాగజ్యోతి (ప్రథమ), ఎస్.సాయిసంజన (ద్వితీయ), బాలుర విభాగంలో ఎం.నరేష్ (ప్రథమ), దేవి హిమనేత్ర (ద్వితీయ), అండర్ -16 బాలురు విభాగంలో కె.పార్థు (ప్రథమ), ఎండి సాహిద్‌శ్రీకర్ (ద్వితీయ), బాలికలు విభాగంలో పిదేదీప్య ప్రథమ బహుమతి సాధించారు.

చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

స్వచ్ఛ సుందరంగా పార్వతీపురం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛ సుందరంగా పార్వతీపురంను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంపై ఆదివారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతకు మారు పేరుగా పార్వతీపురం నిలవాలని పేర్కొన్నారు. ఎక్కడ చూసిన పరిశుభ్ర వాతావరణం తో ఆహ్లాదకారంగా కనిపించాలని అన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి, చెత్త నుంచి సంపదను సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే జట్టు ఆశ్రమం చర్యలు చేపట్టిందని, అదేవిధంగా మరిన్ని సంస్థలు ముందుకువచ్చేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే రహదారులు, పార్కులు, విద్యుత్, ట్రాఫిక్ తదితర రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉందని అన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చి గుంతలు లేని రహదారులకు చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలోని ఒక్కో కూడలిని దత్తత తీసుకొని సామాజిక బాధ్యతతో సర్వ సుందరంగా తీర్చిదిద్దేలా వాణిజ్యవేత్తలు, ఇతర వర్గాలను కోరినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో చక్కని కళా ప్రతిమలు ఏర్పాటుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆచార్యులతో చర్చించామని తెలిపారు. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వాహనాల కోసం పార్కింగ్, సిగ్నల్ లైట్ల వ్యవస్థను ఏర్పాట్లు చేయబోతున్నట్లు కలెక్టర్ వివరించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, వివిధ అసోసియేషన్లు, ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదులో అవస్థల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అపార్ ప్రక్రియ నమోదుకు గిరిజన విద్యార్థులు, వారి తల్లి దండ్రులు అనేక అవస్థలు పడుతున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ చెప్పారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఆ అవస్థలు తీర్చి ప్రక్రియ సులువుగా, సక్రమంగా జరిగేలా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ చర్యలు తీసుకోవాలని కోరారు. బర్త్ సర్టిఫికెట్ లేక, పాఠశాల, ఆధార్ కార్డుల్లో లోపాలు ఉండటం, సరిచేయడానికి, సచివాలయం, అడ్వకేట్ నోటరీ, మీ సేవ, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితి దృష్టిలో పెట్టుకుని అపార్ ప్రక్రియ గిరిజన విద్యా సంస్థల్లోనే నేరుగా జరిగేలా ఆలోచన చేయాలని కోరారు.

స్వచ్ఛ సుందరీకరణపై నేడు వర్క్ షాప్

ప్రజాశక్తి - కురుపాం

స్వచ్ఛ సుందరీకరణపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రత్యేక అధికారి కె. రామచంద్రరావు ఆధ్వర్యంలో వర్క్ షాప్ జరుగుతుందని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలు మేరకు నియోజకవర్గస్థాయి వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున నియోజకవర్గంలోని ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో పాల్గొవాలని కోరారు.

జలవిహారం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

పర్యాటకులతో పోటెత్తిన పార్కు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ ఆదివారం పర్యాటకులతో పోటెత్తింది. కార్తీక మాసం, అందులో ఆదివారం సెలవు దినంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నిండే కాకుండా ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ముందుగా పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచివెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహారయాత్ర చేశారు. చిన్నారులు మినీ బోటింగ్, మినీ ట్రైన్ నడిపారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. అక్కడ అందమైన పకోడాలను చూశారు. ఆదలి యు పాయింట్‌ను సందర్శించి మేఘాలు పరుగు తీస్తున్న కళ్లుమైమరిపించే ప్రకృతి అందాలను కనువిందు చేసుకున్నారు. పర్యాటకులు ఇతర జిల్లాల నుంచి కూడా రావడంతో వాహనాలు బారులు తీరాయి.

గ్యాస్ కనెక్షన్లతో పాట్లు

ప్రజావక్తి - మక్కువ

మండలంలోని సుదూర ప్రాంతాలైన పార్వతీపురం, సాలూరు కేంద్రాలుగా పనిచేస్తున్న భారతి ఇండోన్ గ్యాస్ ఏజెన్సీల కనెక్షన్లతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని తూరు మామిడి సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 29న గ్యాస్ బుకింగ్ చేసుకున్నప్పటికీ ఆ రెండు ఏజెన్సీల్లో తరచూ వెనక్కి మెసేజ్లు వెళ్లిపోతున్నాయి తప్ప బండలు రావడంలేదని అన్నారు. అలాగే గ్యాస్ సరఫరాలో కూడా వేళా పాల ఉండడం లేదని, వారికి నచ్చినట్లు సరఫరా చేయడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా గ్యాస్ ఏజెన్సీలు సకాలంలో వినియోగదారులకు గ్యాస్ బండలు సరఫరా చేయాలని, లేకుంటే దగ్గరలో ఉండే ఏజెన్సీలకు వారి వినియోగదారులను బదిలీ చేయించే వీలు కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా సివిల్ సప్లై మేనేజర్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా సంబంధిత సకాలంలో వినియోగదారులకు గ్యాస్ బండలు అందేలా చర్యలు తీసుకునేందుకు మండల సిఎస్‌డిటిని ఆదేశించనున్నట్లు ఆయన వెల్లడించారు

నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల పుస్తకాలు అందజేస్తున్న ఎస్‌సొసైటీ సభ్యులు

గిరిజన గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన నెల్లికెక్కువ, కొత్తవలసలో మోసెస్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో ఎస్.సొసైటీ ఆధ్వర్యంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. చదువుకున్న యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, పుస్తకాలు భద్ర పర్చుకోడా నికి కావాల్సిన ఫర్నీచర్ అందించారు. వీటిని సద్వినియోగపర్చుకొని యువత ఉన్నత ఉద్యోగాలు పొందాలని, గ్రామాల అభివృద్ధికి నాంది పలకాలని మోసెస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇబ్రహీం మొహమ్మద్, వలి కోరారు. ఆదివాసీ యువత పక్కతోవ పట్టకుండా ఉండేందుకు గ్రంథాలయాలు చాలా దోహదపడతాయని ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. కార్యక్రమంలో దుడ్డుఖల్లు సర్పంచ్ నీలావతి, నాయకులు నిమ్మక సింహాచలం ఉన్నారు.

కిట్టలపాడు జంక్షన్ వద్ద డ్రింకింగ్ డ్రైవ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిట్టలపాడు జంక్షన్ వద్ద ఎస్సై వై.అమ్మనరావు డ్రంకింగ్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపిన వాహన చోదకులకు డ్రంకింగ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడప రాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. సీతంపేట ఏజెన్సీ పర్యాటక ప్రాంతం కావడం, అందులో కార్తీక మాసం రావటంతో జిల్లాల నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తుండడంతో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎక్కడికి అక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మి

సైబర్ క్రైమ్ నేరాలపై మహిళలకు అవగాహన

కురుపాం : స్థానిక రావాడ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం సైబర్ క్రైమ్ నేరాలపై మహిళలకు పోలీస్ సిబ్బంది జి.లక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో మాట్లాడుతూ తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు వచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, బ్యాంకు నుంచి లోన్లు ఇస్తామని ఫోన్లు చేస్తుంటారని, అటువంటి వాటికి పూర్తిగా నమ్మొద్దని, అలా నమ్మి చాలామంది మోసపోయారని అన్నారు. కావున అటువంటి వాటికి దూరంగా ఉండి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

14మద్యం సీసాలు స్వాధీనం

సీతానగరం : మండలంలోని సుభద్ర సీతారాంపురంలో బెల్టు షాపుపై దాడులు నిర్వహించగా, 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని మహిళను అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు, నాటు సారాయి విక్రయాలు జరిగినా, ప్రైవేట్ మద్యం షాపుల్లో ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

పెద్దగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగునీరిందించాలి

పాచిపెంట మండల సిపిఎం మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ ఎడమ కాలువ ద్వారా లిఫ్టు ఛానల్ నుండి సాగునీరందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల మహాసభ తీర్మానించింది. మండల కేంద్రమైన పాచిపెంటలో ఆదివారం మండల మహాసభ జరిగింది. తొలుత సిపిఎం సీనియర్ నాయకులు సూకురు అప్పలస్వామి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ ఈ మహాసభ సందర్భంగా కార్మిక, గిరిజన, రైతాంగ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన జీవో 3ను పునరుద్ధరించాలని ఉద్యమాలకు నాయకత్వం వహించింది ఎర్రజెండా అని అన్నారు. ఈ మహాసభ స్ఫూర్తితో కుడుమూరు 48 సర్వేనెంబర్ 782 ఎకరాలు భూమి సాగులో ఉన్న గిరిజనులకు హక్కులు కల్పించాలని, కొండతాడూరు, కుడుమూరు గిరిజనపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని, పద్మాపురం, చిట్టిపురం జమీందారు పేరుతో ఉన్న భూములకు పట్టాల మంజూరు చేయాలని తీర్మానించారు. అలాగే పాచిపెంటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, పెద్దగెడ్డ జలాశయం వద్ద పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రధానమైన గేటు వద్ద వాచ్మెన్ నియమించాలని, అన్‌సర్వేడ్ భూములు సర్వేలు చేయాలని మహాసభలో తీర్మానించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మహాసభలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, రెడ్డి పారమ్మ, కొర్ర కళ్యాణ్, సుబ్బారావు, ఎర్రయ్య బోను గౌరు నాయుడు, సూకురు రామారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హామీలను అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, లేకుంటే భవిష్యత్తులో ప్రజలందరినీ కలుపుకొని పోరాటాలకు సిద్ధపడతామని సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం సిపిఎం రెండో పట్టణ మహాసభ సింహాద్రి, శంకర్రావు, ఇందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ జిల్లాలో మూతపడ్డ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించని పరిస్థితి ఉందని, వీటిపై భవిష్యత్తులో ప్రజలను కలుపుకొని పోరాడుతామని తెలిపారు. అనంతరం భవిష్యత్తులో పట్టణం అభివృద్ధికి చేపట్టబోయే కర్తవ్యాలను తీర్మానాల రూపంలో ఆమోదించారు. వీటిలో రైతు బజార్ ప్రారంభించాలని, ప్రభుత్వ ఐటిఐ, లైబ్రరీలకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించాలని, గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ప్రారంభించాలని, జీగిరాం జ్యూట్ మిల్లును తెరచి,

పట్టణ మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కార్మికులకు ఉపాధి ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలన్నీ వెంటనే ప్రజలకు అందించాలని, అధిక ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, సాలూరు పట్టణం అభివద్ధి కోసం మార్కెట్‌ను త్వరితగతిని అభివృద్ధి చేసి, అర్హులైన పేదలకు ఇవ్వాలని తీర్మానించారు. పై సమస్యలు ప్రభుత్వం పరిష్కరించిన యెడల భవిష్యత్తులో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు ముందుకు తీసుకువెళ్లాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం ఏడుగురికి పట్టణ నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నికైంది. కన్వీనర్‌గా ఎన్‌వై నాయుడు, సభ్యులుగా వెంకటరావు, ఇందు, రవి, పోలారావు, నితిన్, శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సిపురంలో పాలిథిన్ విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం పంచాయతీ పరిధిలో పాలిథిన్ సంచుల విక్రయాలు నిషేధిస్తున్నట్లు కార్యదర్శి ఎం.జగన్‌మోహన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పాలకవర్గ సమావేశం మేరకు సర్పంచ్ చెరుకుబిల్లి బంగార మ్మ, ఉప సర్పంచ్ కాపారపు శివున్నాయుడుతో పాటు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం మేరకు గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఎటువంటి ప్లాస్టిక్ సంచులు, గ్లాసులతో పాటు ఉత్పత్తులను విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు. ఉత్తర్వులు ఉల్లంఘించి గ్రామంలో ఎవరైనా దుకాణదారులు ప్లాస్టిక్ వినియోగించినా విక్రయాలు జరిపినా జరిమానా విధించడం అవుతుందని హెచ్చరించారు. ఈ మేరకు దుకాణదారులకు నోటీసులతో పాటు గ్రామంలో దండోరా వేయించారు.

నిధులున్నా ముందుకు రాని కాంట్రాక్టర్లు

- టెండర్లు పిలిచినా ఆసక్తి చూపని వైనం
- మౌలిక సదుపాయాలకు దూరమైన పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొట్లాది రూపాయలు నిధులున్నా అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ఎందుకు రావడం లేదో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది. మున్సిపాల్టీలో రూ.10 కోట్లు సాధారణ నిధులు ఉన్నప్పటికీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 కోట్ల 58 లక్షల్లో రూ.కోటీ 75 అభివృద్ధి పనులకు ఖర్చు అవ్వగా, మిగిలిన రూ.10 కోట్ల 63 లక్షలు ఉన్నాయి. రూ.కోటీ 17 లక్షలు అభివృద్ధి పనులకు ప్రతిపాదన చేసి కౌన్సిల్ ఆమోదంతో 30 వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. అయినా పనులు చేసేందుకు ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో వార్డుల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు జరగడంలేదు. దీనికి ముఖ్య కారణం కూడా ఉందనే చెప్పవచ్చు. గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.కోటీ 50లక్షలు బిల్లులు ఈ ఏడాది జూన్ నుంచి మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన పనుల బిల్లుల చెల్లింపు ఇంతవరకు జరగకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల నుంచి సచివాలయాల అద్దె చెల్లింపులు, సంబంధిత భవన యజమానులకు జరగకపోవడంతో సచివాలయలను ఖాళీ చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఒక నెల ఆయిల్ బిల్లు చెల్లింపు జరగకపోవడంతో మున్సిపల్ కార్యాలయానికి ఆయిల్ సరఫరా చేసే పెట్రోల్ బంక్ యజమాని అసహనం వ్యక్తం చేస్తుండడం గమనార్హం. గతంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లులు, కార్యాలయంలో నిర్వహణకు సంబంధించిన బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు బహిరంగంగానే కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం

అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు జరిపితే, ఆ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు శరవేగంగా జరుగుతాయని ఆశపడిన కాంట్రాక్టర్ల ఆశలు ఆవిరైపోయాయనే చెప్పవచ్చు. మున్సిపాలిటీలో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చొరవ తీసుకొని సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనుల జరిపించేందుకు చర్యలు చేపడితే పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించవచ్చు, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో పాటు పాలకపక్ష కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తానవలసలో గ్రానైట్ తవ్వకాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని తానవలస గ్రామస్తులు బడిదేవరకొండ తవ్వకాలతో ఇబ్బందులకు గురవుతున్నారని, అందువల్ల తవ్వకాలను ఆపాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు డిమాండ్ చేశారు. ఈ గ్రామస్తుల వినతి మేరకు వైసిపి నాయకులతో కలిసి ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బడిదేవర కొండను ఆనుకుని ఉన్న గిరిజన ప్రజలు గ్రామంలో గల సమస్యలు ఏకరువు పెడుతూ బడిదేవర కొండపై తవ్వకాలు మళ్లీ మొదలు పెట్టడంతో తమ బతుకులు ఛిద్రం అవుతాయన్నారు. దీనికి స్పందించిన జోగారావు ఈ సమస్య పై పోరాడే అన్ని వర్గాలతో తాము ముందుకు నడిచేందుకు సిద్ధంగా ఉన్నామని, శాంతి యుతంగా సమస్య పరిష్కారమయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపిపి జగన్నాథం, సర్పంచ్లు వెంకయ్య, శ్రీరాములు, వై.తిరుపతిరావు, స్థానిక పెద్దలు, ప్రజలు యువత పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను స్థానిక గవర్నమెంట్ హై స్కూల్‌లో నిర్వహించారు. యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అన్న అంశంపై చిత్ర లేఖనం పోటీ నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక గవర్నమెంట్ హై స్కూల్, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, కెజిబివి విద్యార్థిని, విద్యార్థులు సుమారు 40 మంది పోటీలో పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి గణేష్ బాబు తెలిపారు. విజేతలకు ఈనెల 20న బహుమతి ప్రదానం ఉంటుం దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమ సుందర్, డ్రాయింగ్ ఉపాధ్యాయులు సింహాచలం, శేషగిరి, గౌరంగా పాణిగ్రహి, గ్రంథాలయ సహాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో భాగంగా జట్టు ట్రస్ట్ కార్యాలయంలో గల గరిమెళ్ళ నారాయణ స్మారక గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా సీతంపేట ప్రాంత వాసులు గ్రంథాలయాల నిర్వహణ చేస్తున్న ఉత్తమ నిర్వాహకులకును అభినందించి ఎపి గ్రంథాలయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ డి.పారి నాయుడు, జిల్లా అధ్యక్షులు టి.శివకేశవరావు మెమోంటోలు అందజేశారు.

గుమ్మలక్ష్మీపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా



సీతంపేటలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు పాల్గొన్న విద్యార్థులు

స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో ఇంగ్లీష్ గ్రామర్ రాయించడం, చదివించడం, కథల పుస్తకాలు చదివించారు. మరోవైపు మ్యూజికల్ చైర్ ఆటలను ఆడించారు. ప్రతి విద్యార్థి ఎంతో ఆసక్తిగా గ్రంథాలయానికి వచ్చి నేర్చుకుంటున్నారని లైబ్రరియన్ సుకన్య తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు.

సమయపాలన ఎంతో అవసరం

ప్రజాశక్తి - పాలకొండ

ఆర్టీసీ ఉద్యోగులకు సమయపాలన ఎంతో అవసరమని ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వర రావు అన్నారు. డిపోలో ఆదివారం సమయపాల నపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ డిసెంబర్ 15 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ మేనేజర్ ఎస్. లక్ష్మణరావు, ఎంఎఫ్. జగన్నాధం, ఎడిసి బికె మూర్తి, తదితరులు ఉన్నారు.

ఘనంగా కోత పండగ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక రావాడ రోడ్డు జంక్షన్ సమీపంలో గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డి.రాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా కోత పండగ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ రాజు కోత పండగ వాక్య సందేశాన్ని వివరించి దీవెనలు అందజేశారు. బైబిల్, చీరలు లక్కీ డ్రాలో చిన్నపిల్లలతో తీయించి గెలుపొందిన వారికి సంఘ పెద్దలు, పాస్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.రాజరత్నం, డి.ప్రదీప్, కె.సుదర్శన్, డి.జయకుమార్, రత్నమ్మ, డి.జాన్, తదితరు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

వైసిపి సభ్యులు డుమ్మా

ఎంపిపి హాజరుతో మారిన రాజకీయాలు

ప్రజాశక్తి - పాలకొండ

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరగాల్సి ఉండగా, సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా పడింది. టిడిపికి చెందిన ఇద్దరితో పాటు వైసిపికి చెందిన ఎంపిపి బొమ్మాల భాను హాజరయ్యారు. ఇప్పటికే ఎంపిపి భాను పార్టీ వీడుతారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ సమావేశానికి హాజరుకావడంతో ప్రచారానికి మరింత బలం చేకూరినట్లైంది.

గౌరవం దక్కక

మండల పరిషత్ లో సరైన గౌరవం దక్కక వైసిపికి చెందిన ఎంపిటిసిలు హాజరు కాలేదని తెలుస్తుంది. అదే విధంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు కూడా ఆహ్వానం అందకపోవడంతో సభ్యులు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. మెజారిటీ సభ్యులు ఉన్నప్పటికీ తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు భావిస్తున్నట్లు సమాచారం.

సరైన పద్ధతి కాదు

మూడు నెలలకు ఒకసారి జరుగుతున్న మండల పరిషత్ సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడం పట్ల తంపటాపల్లి ఉప సర్పంచ్, టిడిపి మండల నాయకులు జాడ శ్రీధర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం దగ్గర విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి సమస్య, రీసర్వే వల్ల ఇబ్బందులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు అనేక సమస్యలు చర్చించాల్సి ఉన్నా సమావేశానికి హాజరు కాకపోవడం సరి కాదన్నారు. బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. ఎన్నుకున్న ప్రజల సమస్యలు చర్చించాల్సి ఉన్నా సమావేశానికి హాజరు కాకపోవడేమిటని అన్నారు. వీరికి ప్రజలే త్వరలో సమాధానము చెప్తున్నారని అన్నారు.

నేటికి వాయిదా

సోమవారం నాటికి సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ విజయ రంగారావు అన్నారు. ఆదివారం ఉదయం 10:30గంఎలకు సమావేశం ప్రారంభించినప్పటికీ 12గంటల వరకు సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో ఎంపిడిఒ సోమవారానికి వాయిదా వేశారు. అయితే శాసన సభా సమావేశాలు జరుగుతున్న సమయంలో సోమవారం ఏ విధంగా సమావేశాన్ని పెడతారని పలువురు చర్చించుకుంటున్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం సభ్యుల కోరం లేకపోవడంతో ఆలస్యంగా 3.20గంటలకు ప్రారంభమైంది. వ్యవసాయ శాఖకు సంబంధించి ఎఒ జక్కు సౌజన్య మాట్లాడుతుండగా తూడి గ్రామ సర్పంచ్ కె.వెంకటరమణ అడ్డుతగిలి గత ఏడాది ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తూడి ఆర్‌బికెలో ఒక్క ట్రక్ షీట్ కూడా కోయలేదని అన్నారు. మా గ్రామ ఆర్‌బికె పరిధిలో గల దశమంతపురం, నర్సిపురం తదితర గ్రామాల రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ట్రక్ సీట్లు అయ్యేవని అన్నారు. అంతేక ట్రేడర్స్ వల్ల ఒక గింజ కూడా కొనుగోలు చేయలేదని, ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కావ్యశ్రీ మాట్లాడుతుండగా నీలానగరం సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తం నాయుడు స్పందిస్తూ తమ గ్రామంలో 50 శాతం మందికి తాగునీరందడంలేదని సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. చలివేంద్రి ఎంపిటిసి పోరెడ్డి వెంకటనాయుడు మాట్లాడుతూ గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకం నిర్మించినప్పటికీ పైప్ లైన్లు ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయంలో జెఇ సమాధానమిస్తూ జల్‌జీవన్ మిషన్ కింద మండలానికి 121 పనులు మంజూరయ్యని, అందులో భాగంగా 53 పనుల వరకు వివిధ స్థాయిలో ఉన్నాయని, ఎక్కడైతే పనులు ప్రారంభించక లేదో అక్కడ అవి నిలిపివేసినట్లు వివరణ ఇచ్చారు. తూడి సర్పంచ్ మాట్లాడుతూ 2014-2019 వరకు ఎన్టీఆర్

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ

గృహాలకు సంబంధించి బిల్లులు చెల్లించి, గత వైసిపి ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. హౌసింగ్ జెఇ వినోద్ కుమార్ జరిగిన పనులు పూర్తయిన ఇళ్లకు బిల్లులు చెల్లిస్తున్నట్లు వివరణ ఇచ్చారు. తోటపల్లి ప్రధాన ఎడమకాలువ ఆధునీకరణ పనులకు సంబంధించి బడ్జెట్లో నిధులు కేటాయించలేదు కనుక ఉపాధిహామీ వ్యవసాయానికి సంబంధించిన పంట కాలువలు బాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపిలు పి.విజయ కుమారి, వి.భార్గవ్, ఎంపిడిఒ బి.వెంకటరమణ, పలుశాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్కూల్, కార్యాలయాల మధ్య పెట్రోల్ బంకు వద్దు

ప్రజాశక్తి - కొమరాడ

ఒకవైపున స్కూలు, మరోవైపు వివిధ కార్యాలయాలు మధ్య పెట్రోల్ బంకు వద్దు అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్, కమిటీ సభ్యులు హెచ్ సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొమరాడలో పెట్రోల్ బంక్ నిర్వహించే స్థలం వద్ద కస్తూరిబా స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్ఎఫ్ఐ నాయకులు స్థలాన్ని పరిశీలించిన అనంతరం పత్రిక విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రానికి అతి సమీపంలో అటు కస్తూరిబా స్కూలు, ఇటు పోలీస్ స్టేషన్, మరోపక్క రజకులకు ఇచ్చిన చెరువు, పసువుల ఆస్పత్రి, హౌసింగ్ కార్యాలయం, రైతులు పొలానికి వెళ్లే రహదారి వద్ద పెట్రోల్ బంకు వద్దని అన్నారు. ఇదే స్థలంలో గిరిజన విద్యార్థులకు హాస్టల్ నిర్మించాలని కోరారు. ఇప్పటికే కస్తూరిబా స్కూల్‌కు ప్రహరీ గోడ కొంత లేదని, ఆట స్థలం కూడా లేదని అన్నారు. ఈ సమస్యలతో పాటు కాలేజీలో చదువుతున్న విద్యార్థులు ఒక్కొక్క రోజు రాత్రి 9గంటల వరకు ఇంటికి చేరుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. దీనివల్ల పిల్లల తల్లిదండ్రులు చాలా బాధపడుతున్నారన్నారు. కావున ఈ విషయాన్ని ఐటిడిఎ పిఒ పరిశీలించి విద్యార్థులకు అటు వివిధ కార్యాలయాలకు ఇబ్బందికరమైన పెట్రోల్ బంకును వేరే చోటుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.